క్లుప్తంగా

అభ్యాస దీపికలు పంపిణీ



అభ్యాస దీపికలు పంపిణీ చేస్తున్న శంకర్

కౌటాల: మండలంలోని గుండాయిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన అభ్యాస దీపికలను శనివారం పాఠశాల కమిటీ చైర్మన్ బి.శంకర్ విద్యార్థులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పది పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ప్రభుత్వం అభ్యాస దీపికలను అందిస్తుందన్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతుల కోసం అల్పాహారం సైతం అందిస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ మాలధారణ



మాలధారణ చేస్తున్న అర్చకుడు శిరీష్‌శర్మ

ఆసిఫాబాద్‌అర్బన్: హనుమాన్ జయంతి పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో 50 మంది భక్తులు 41 రోజుల పాటు మండల దీక్షను స్వీకరించారు. అర్చకుడు ఒజ్జల శిరీష్‌శర్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు మాలధారణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పిన్నా వివేక్, మురళీగౌడ్, మధు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవం

కాగజ్‌నగర్‌టౌన్: సంత్ సేవాలాల్ మహారాజ్ 284 జయంతి ఉత్సవాలను తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు సంత్ శ్రీ సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11. 30 గంటలకు ప్రారంభమయ్యే ఉత్సవాల్లో కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన బంజార కులస్తులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

దళిత జర్నలిస్టుల ఫోరం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను సంఘం నాయకులు ఆవిష్కరించారు. దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈర్ల సతీష్ ఆధ్వర్యంలో సంఘం పదాధికారులు పోస్టర్లు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మార్చి 9న జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించే దళిత జర్నలిస్టుల ఫోరం మహాసభల్లో జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. ఫోరం జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి రతన్‌కుమార్, రవీందర్, జాడి రాజేష్, రేగుల రాజు, సమీర్ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్	
కుమురంభీం	:ధమాక
కాగజ్‌నగర్	
వెంకటరమణ	:ధమాక

\- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.20
పచ్చిమిర్చి	50
చిక్కుడు కాయ	30
బీరకాయ	40
వంకాయ	40
కాకరకాయ	50
బెండకాయ	120
అలసంద	40
దొండకాయ	80
సోరకాయ	60
పాలకూర	60
గోబి(పూల్)	40
క్యారెట్	50
చామగడ్డ	80
క్యాబేజి	40
సిమ్లామిర్చి	100

\-ఆసిఫాబాద్‌అర్బన్



కౌటాల క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న అన్నార్తులు

పేదల కడుపు నింపే మాకీ రోటీ

ప్రస్తుత ఆధునిక కాలంలో కూడా తినడానికి తిండిలేక ఎంతోమంది ఆకలితో అలమటిస్తున్నారు. నిరుపేదలు, కూలీలు ఎంతో మంది ఆకలి తట్టుకోలేక ప్రాణాలు సైతం కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఎవరూ కూడ ఆకలితో బాధపడొద్దని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో పాటు తెలంగాణలోని కౌటాల మండలంలో యువ పరివర్తన్ సంస్థ ఆధ్వర్యంలో మాకీ రోటీ పేరిట రూ.15లకే మంచి భోజనం అందిస్తున్నారు.

- రూ. 15లకే ప్లేట్ భోజనం
- అన్నార్తుల ఆకలి తీర్చుతున్న యువ పరివర్తన్ సంస్థ
- ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణలో క్యాంటీన్లు

సండే స్పెషల్

కౌటాల: పొట్టకూటి కోసం ఊరుగాని ఊరొచ్చిన కూలీలు గత లాక్‌డౌన్‌లో పడిన కష్టాలను కళ్లారా చూశారాయన. ముంబైకి వలసవచ్చిన కూలీలు తిండి కోసం అల్లాడుతుంటే తన వంతుగా వారికి ఏదైనా చేయాలనుకున్నారు ముంబైకు చెందిన ఎన్ఆర్ఐ కిశోర్‌ఖైర్. ఇందుకోసం లాక్‌డౌన్‌లో వలస కూలీలకు అన్నదానం చేశారు. అంతటితో తృప్తి చెందకుండా జిల్లా, మండల కేంద్రాలకు ఆయా గ్రామాల నుంచి పని కోసం వచ్చే కూలీలతో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చే పేద ప్రజల కడుపు నింపాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం మరికొంత మంది ఎన్ఆర్ఐల సహకారంతో 'యువ పరివర్తన్' అనే స్వచ్ఛంద సంస్థ స్థాపించాడు. ఈ సంస్థ ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలతో పాటు తెలంగాణలో కూడా పేదలకు తక్కువ ధరలో మంచి భోజనం అందిస్తున్నారు.

రుచికరమైన భోజనం..

ఆశయం మంచిదైతే ఎంత దూరమైనా వెళ్లొచ్చని నిరూపించారు కిశోర్‌ఖైర్. ముందుగా ఛత్తీస్‌గఢ్‌లో కూలీల ఆకలి తీర్చేందుకు సిద్ధమయ్యారు. వీరి సంస్థకు తోడుగా 'మా ఫౌండేషన్' అనే మరో సంస్థ జత కలిసింది. దీంతో ముందుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఏటపెల్లి, ధనోరాతో పాటు మహారాష్ట్రలోని ఆస్టి, తెలంగాణలోని కౌటాలలో 'మాకీ రోటీ' అనే పేరుతో క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. తక్కువ ధరకే మంచి భోజనం అందిస్తూ నిరుపేదల మన్ననలు పొందుతున్నారు. మొదట్లో రూ. 10లకే భోజనం అందించేవారు. అయితే నూనె, కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో నిర్వాహకులు మరో రూ.5 పెంచి ప్రస్తుతం రూ.15కి ప్లేట్ భోజనం అందిస్తున్నారు.

మహిళలకు ఉపాధి..

యువ పరివర్తన్ స్వచ్ఛంద సంస్థ స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు సైతం చేయూతనందిస్తోంది. సంఘాల మహిళలకు తమ స్వచ్ఛంద సంస్థ పనితీరు గురించి వివరించి ఆసక్తి గల వారిని గుర్తించి క్యాంటీన్లో వంటలు చేసే బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఇందుకు వారికి రోజుకు కూలీ కింద రూ.300 చెల్లిస్తున్నారు. అంతేకాకుండా వివిధ ప్రాంతాల్లో ఉన్న క్యాంటీన్లకు సరుకులు, కూరగాయలు తదితర వస్తువులను తరలించేందుకు సేవాభావం కలిగిన యువతను ప్రోత్సహిస్తూ స్వచ్ఛంద సంస్థలో సభ్యునిగా చేర్చుకుని నెలకు రూ.9వేలు అందజేస్తున్నారు. కాగా కౌటాలలో ఏర్పాటు చేసిన 'మాకీ రోటీ' క్యాంటీన్ ఎంతో ఉపయోగకరంగా ఉందని మండలవాసులు పేర్కొంటున్నారు. ఇటీవల క్యాంటీన్‌లో భోజనం చేసిన జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తక్కువ ధరకే రుచికరమైన భోజనం అందిస్తున్న నిర్వాహకులను అభినందించారు.



క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ (ఫైల్)

అదనపు కలెక్టర్ మెచ్చుకున్నారు



క్యాంటీన్‌లో నేను ప్రతీరోజు వంట చేస్తాను. ఇందుకు నాకు రోజుకు రూ.300 కూలీ ఇస్తున్నారు. మొదట్లో రూ.10కే ప్లేట్ భోజనం అందించేవాళ్లం. ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో మరో రూ.5 పెంచాం. ఇటీవల అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ భోజనం తిని మెచ్చుకున్నారు. ప్రస్తుతం క్యాంటీన్‌ను టార్పాలిన్ షెడ్‌లో నిర్వహిస్తున్నాం. ఉన్నతాధికారులు స్పందించి క్యాంటీన్‌కు పక్కా గది కేటాయించాలి.

\- కె.తులసమ్మ, కౌటాల

రుచికరమైన భోజనం



మాకీ రోటీ క్యాంటీన్‌లో రూ.15కే రుచికరమైన భోజనం అందిస్తున్నారు. ప్రతీరోజు అన్నం, కూర, పప్పు అందిస్తారు. దూర ప్రాంతాల నుంచి పనుల నిమిత్తం, కూలీ పని కోసం వచ్చిన వారు క్యాంటీన్‌లో తక్కువ ధరకే భోజనం చేస్తున్నారు. క్యాంటీన్ ఏర్పాటు చేయడంతో పేద ప్రజల ఆకలి తీరుతుంది.

\- బిక్కు, మొగడ్‌దగడ్

సేవ చేయడమే లక్ష్యం



ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రతో పాటు తెలంగాణలోని మారుమూల ప్రాంతాల నుంచి జీవనోపాధి కోసం చాలా మంది ముంబైకి రావడం గమనించాను. వారికోసం ఏదైనా చేయాలని అనుకున్న. తోటి ఎన్ఆర్ఐల సాయంతో మారుమూల ప్రాంతాల్లో క్యాంటీన్లు ఏర్పాటు చేశాం. నిరుపేదల ఆకలి తీరుస్తుండటం మాకెంతో సంతోషాన్ని ఇస్తుంది. తెలంగాణలోని మరిన్ని ప్రాంతాల్లో క్యాంటీన్లు ఏర్పాటు చేస్తాం.

\- కిశోర్‌ఖైర్, ఎన్ఆర్ఐ, ముంబై

'పది' విద్యార్థుల మార్కులు పరిశీలన



మార్కులు పరిశీలిస్తున్న బృందం సభ్యులు

కౌటాల: మండలంలోని మొగడ్‌దగడ్ ఆశ్రమ ఉన్నత పాఠశాల, బోదంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను శనివారం ఉపాధ్యాయ బృందం సభ్యులు పరిశీలించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. గావుడే హన్మంతు, ఎం.శ్యాంరావ్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల మార్కులను బృందం సభ్యులు స్వర్ణ, ఆరె అన్నపూర్ణ, కొమ్మెర రాజేశ్వరరావులు పరిశీలించారు. పాఠశాల హెచ్ఎం మేడి చరణ్‌దాస్, ఉపాధ్యాయులు యశ్వంత్, ప్రభాకర్, శ్రీదేవి, అనీస్ అహ్మద్, తుకారం, సదానందం, జమునాదాస్, పార్వతి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'వంటగ్యాస్‌ను పొదుపుగా వాడుకోవాలి'

ఆసిఫాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వంటగ్యాస్‌ను పొదుపుగా వాడుకోవాలని సాయి కృష్ణ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ లోయపెల్లి రాజేశ్వర్ రావు అన్నారు. మండలంలోని అడ గ్రామంలో శనివారం ప్రజలు వంట గ్యాస్‌వినియోగం, సేఫ్టీపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఉజ్వల పేరుతో కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచిత వంటగ్యాస్ అందజేస్తుందన్నారు. గ్యాస్ పొదుపు, వినియోగం, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి, కార్యదర్శి ప్రవంతి, సత్యనారాయణ గౌడ్, బాబురావు, అంగన్‌వాడీ టీచర్ సుజాత, ఏఎన్ఎం లీల, ఆశ వర్కర్ విజయ పాల్గొన్నారు.

పీడీఎఫ్ పత్రాలు అందజేత

తిర్యాణి: సింగరేణి ఓపెన్‌కాస్టు ఏర్పాటులో భూములను కోల్పోయిన మండలంలోని దేవాయిగూడ గ్రామానికి చెందిన 80మంది భూ నిర్వాసితులకు శుక్రవారం మండల కేంద్రంలో తహసీల్దార్ అనంతరాజు పీడీఎఫ్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ హన్మండ్ల జగదీశ్ తదితరులు ఉన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే ఆత్రం సక్కు

తిర్యాణి: అన్నివర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 51 మంది లబ్ధిదారులకు మంజూరైనా చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ చంద్రశేఖర్, తహసీల్దార్ అనంతరాజు, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ హన్మండ్ల జగదీశ్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గుణవంత్‌రావు, ఎంపీటీసీ బుర్ర రాజ్యలక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, సర్పంచులు గోపాల్, మధుకర్, బాదిరావు ఉన్నారు.

దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

దేవాలయల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయానికి మంజూరైన రూ.4 లక్షల విలువ గల రేకుల షెడ్డు నిర్మాణానికి శనివారం ఆయన భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దైవ చింతన కలిగి ఉండాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, జెడ్పీటీసీ చంద్రశేఖర్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ హన్మండ్ల జగదీశ్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

రెండోరోజుకు విద్యుత్ ఉద్యోగుల నిరసన

కాగజ్‌నగర్‌టౌన్: విద్యుత్ ఉద్యోగులకు వేతన సవరణను తక్షణమే ప్రకటించాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగులు శుక్రవారం ప్రారంభించిన నిరసన రెండోరోజు శనివారం కొనసాగింది. నల్లబ్యాడ్జీలు ధరించి విద్యుత్ ఉద్యోగులు తమ విధులకు హాజరయ్యారు. విద్యుత్ ఉద్యోగుల జిల్లా జాక్ కో కన్వీనర్ ఎమ్మాజీ సతీష్ మాట్లాడుతూ 11 నెలలు గడుస్తున్నప్పటికీ యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తూ వేతన సవరణను ప్రకటించడం లేదని వాపోయారు. నాయకులు రామకృష్ణ, శ్రీనివాస్, ప్రతాప్, శ్రీరాములు, స్వామి తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

పదవీ విరమణ చేస్తున్న అధికారికి సన్మానం

రెబ్బెన: మందమర్రి ఏరియాలో ఎస్వోటూజీఎంగా పని చేస్తూ సీహెచ్ కృష్ణారావు ఈనెలలో పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా బెల్లంపల్లి ఏరియా అధికారులు శనివారం సన్మానించారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లో ఏరియా జీఎం దేవేందర్‌తో పాటు ఉన్నతాధికారులు కృష్ణారావును సన్మానించారు. ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహరా, డీజీఎం ఎఫ్అండ్ఏ రామారావు, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఏరియా జీఎం దేవేందర్

'మిగులు భూములు తీసుకుని న్యాయం చేయాలి'

రెబ్బెన: సోనాపూర్‌లో మిగులు భూములను కూడా తీసుకుని సింగరేణి అధికారులు తమకు న్యాయం చేయాలని సోనాపూర్ రైతులు కోరారు. శనివారం గోలేటి ఓసీపీ ఏర్పాటులో ముంపునకు గురయ్యే భూములకు హద్దులు ఏర్పాటు చేసేందుకు శనివారం సింగరేణి సర్వే, ఎస్టేట్స్ అధికారులు వెళ్లగా రైతులు తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులు మధూకర్‌గౌడ్, ధర్మూ, రాజేశ్వర్ పాల్గొన్నారు.



సింగరేణి అధికారులతో మాట్లాడుతున్న రైతులు

ఘనంగా అవతార్ మెహర్ బాబా జయంతి



చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న భక్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: అవతార్ మెహర్ బాబా జయంతిని శనివారం జిల్లా కేంద్రంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో భక్తులు తాటిపల్లి రాజేశ్వర్, అశోక్ గిరీష్, ఆశిష్, సంతోష్, చంద్రమోహన్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ అమరేందర్, ప్రసాద్ రాజు, సంతోష్, అధ్యాపకులు సోమయ్య, చంద్రశేఖర్, మహేందర్ పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సభ్యులు

కౌటాల: మండలంలోని తాటిపెల్లి కుల్దా హనుమాన్ ఆలయంలో శనివారం హుండీ లెక్కించారు. శివరాత్రి సందర్భంగా ఆలయంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎల్ములె దత్తు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు వచ్చిన కానుకలు, నగదు లెక్కించారు. ఆలయానికి రూ. 3లక్షల 57వేల ఆదాయం వచ్చినట్లు సభ్యులు తెలిపారు.

అన్న, చెల్లికి సైనిక్‌లో సీటు



విష్ణువర్ధన్



వైష్ణవి

కౌటాల: మండలంలోని గురుడుపేట గ్రామానికి చెందిన మెర్పల్లి సదాశివ్-రమాదేవి దంపతుల కుమారుడు మెర్పల్లి విష్ణువర్ధన్, కూతురు వైష్ణవికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కలికిరిలోని సైనిక్ పాఠశాలలో సీటు వచ్చినట్లు తండ్రి సదాశివ్ శనివారం తెలిపారు. విష్ణువర్ధన్ కౌటాలలోని ఇన్‌ఫంట్ జీసస్ ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతుండగా వైష్ణవి కౌటాలలోని భారతీ విద్యా మందిర్ పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. 9వ తరగతిలో విష్ణువర్ధన్‌కు, 6వ తరగతిలో వైష్ణవికి సీటు వచ్చిందని తెలిపారు.

'సిర్పూర్' అభివృద్ధికి బీజేపీ కృషి

- బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు

కౌటాల: సిర్పూర్(టి) నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండలంలోని వీరవెల్లి, కౌఠి, సాండ్‌గాం గ్రామాల్లో ఇటీవల చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ నాలుగు వరుసల జాతీయ రహదారి సర్వే పనులను ఆయన పరిశీలించారు.

యువత క్రీడల్లో రాణించాలి

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని హరీష్‌బాబు అన్నారు. వీరవెల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పాల్వాయి పురుషోత్తంరావు స్మారక క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. పార్టీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, నాయకులు కొండయ్య, విజయ్, ఎల్ములే మధుకర్, ప్రకాశ్, భరత్, సురేష్, నాందేవ్, మోరేశ్వర్ పాల్గొన్నారు.

సాగునీరు అందించాలి

సాండ్‌గాం ఎత్తిపోతల పథకానికి వెంటనే మరమ్మతులు చేసి పంటలకు సాగునీరు అందించాలని బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని సాండ్‌గాం ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతుల పంటలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా ఉండడం దారుణమన్నారు. కార్యక్రమంలో బండి రాజేందర్‌గౌడ్, కుంచాల విజయ్, ఎల్ములే మధుకర్, ప్రకాశ్, తదితరులు ఉన్నారు.

దుండగులను శిక్షించాలి

చింతలమానెపల్లి: నియోజకవర్గంలోని ఆలయాలలో విగ్రహాలను ధ్వంసం చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని హరీష్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని ఖర్జెల్లి శివాలయాన్ని దర్శించుకున్నారు. విగ్రహాలు ధ్వంసం చేయడాన్ని ఖండించారు. పోలీసు యంత్రాంగం వెంటనే దుండగులను పట్టుకోవాలని ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేందర్ గౌడ్, రౌతు శంకరయ్య, డోకె మల్లేష్ ఉన్నారు.



సర్వే పనులు పరిశీలిస్తున్న హరీష్‌బాబు

వ్యవసాయ ఉప ఉత్పత్తులపై దృష్టి సారించాలి

రెబ్బెన: వ్యవసాయ ఉప ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త స్రవంతి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉన్నతి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలోని రైతులు, ఉపాధిహామీ కూలీలు వ్యవసాయ ఉప ఉత్పత్తులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. టమాట ఉప ఉత్పత్తులు సాస్, కెచప్‌పూర్ తయారీతో కలిగే లాభాలు వివరించారు. ఆయిల్‌పాం తోటల పెంపకం, తేనెటీగల పెంపకంపై ఆసక్తి కనబర్చాలన్నారు. డీఎల్ ఆర్సీ మల్లేష్, జీఆర్‌పీ ఆనంద్, ఏపీఎం రాజ్‌కుమార్, ఏపీవో బుచ్చన్న, ఈసీలు, టీఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ సింగ్